క్లుప్తంగా

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలోని సోమిరెడ్డిపల్లె సహకార పరపతి సంఘంలో రుణాలు పొందిన వారు, ఓటు హక్కు కల్గిన వారు తప్పకుండా ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోవాలని సంఘం తాత్కాలిక అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి ఒక ప్రటనలో తెలిపారు. రుణాలు పొందిన వారు రెండు పాస్‌పోర్టు ఫొటోలు, ఆధార్‌తో బి.మఠంలోని సహకార పరపతి సంఘంలో అనుసంధానం చేయించుకోవాలన్నారు.

రైస్ మిల్లులపై ఆకస్మిక దాడులు

మైదుకూరు : మైదుకూరులోని పలు రైస్ మిల్లులపై శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. స్థానిక లక్ష్మీ గణపతి రైస్ మిల్లులపై పలు శాఖలకు చెందిన విజిలెన్స్ అధికారులు దాడి చేసి రికార్డులను పరిశీలించారు. బియ్యం నిల్వలు, రవాణా అంశాలకు చెందిన రికార్డులను పరిశీలిస్తున్నట్లు ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు తెలిపారు.

మండిపోతున్న కూరగాయల ధరలు

పోరుమామిళ్ల : కూరగాయల ధరలు అమాంతం పెరిగి పోయాయని, 40 ఏళ్లలో ఏనాడూ కూరగాయలు ఇంతధరలు అమ్మలేదని సీపీఐ నాయకులు పిడుగు మస్తాన్, రవి, కేశవ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ టమోటా కిలో రూ.70, పచ్చిమిర్చి కిలో రూ.150, కొత్తిమీర కట్ట రూ.100 ఇలా ఏదీ 50 రూపాయలకు తక్కువ లేదన్నారు. చిన్న సంచిలో కూరగాయలు తెచ్చుకోవాలంటే రూ.300 నుంచి 400 అవుతున్నాయన్నారు. సామాన్యులు తల్లడిల్లిపోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కూరగాయల ధరలను నియంత్రించి ప్రజలను ఆదుకోవాలన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : పట్టణంలోని భాష్యం, కేశవరెడ్డి విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్నాయని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలు తెరవక ముందే వారు అడ్మిషన్లు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కోచింగ్ పేర్లతో క్లాసులు నిర్వహించి అధిక వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. క్వాలిఫైడ్ టీచర్లు కాకుండా అన్ క్వాలిఫైడ్ టీచర్లను ఏర్పాటు చేసుకుని వారికి తక్కువ జీతాలు ఇస్తున్నారని తెలిపారు. కాలం చెల్లిన బస్సులను నడుపుతూ, లైసెన్స్ లేని డ్రైవర్లను పెట్టుకుని విద్యార్థులను ప్రమాదాలకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖాధికారులు ఈ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కేబుల్ దొంగలతో బెంబేలెత్తుతున్న రైతులు

పోరుమామిళ్ల : వ్యవసాయ బోర్ల వద్ద స్టార్టర్‌కు, మోటార్‌కు మధ్య కేబుల్ కట్ చేసుకుని పోతున్న దొంగలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఒక్క రంగసముద్రం పంచాయతీలోనే గత వారం రోజుల్లో 15 మందికి పైగా రైతుల పొలాల్లో కేబుల్ కట్ చేసి తీసుకపోయారని రైతులు ఆవేదన చెందుతున్నారు. పోలీసులు నిఘా పెట్టి దొంగలను పట్టుకుని తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. వేసవి కాలం కావటంతో పొలంలో పైరు లేదని, అందువల్ల రైతులు ఎవ్వరూ పొలాల వద్దకు వెళ్లడం లేదన్నారు. బీడు పొలాల్లో వ్యవసాయ బోర్ల కేబుల్ తీసుకెళుతుండటంతో తాము ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణ, మండల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో మెయింటెనెన్స్ పనుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 33కేవీ ఐడీఏ ఫీడర్, 33కేవీ మార్కెట్ యార్డు ఫీడర్, 33కేవీ ప్రొద్దుటూరు టౌన్ ఫీడర్, పలు 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విజయనగరం వీధిలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి నూతన పట్టువస్త్రాలు, వెండి కవచాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కాయాకర్పూరాలను నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ప్రజా తీర్పును శిరసా వహిస్తున్నా

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రజా తీర్పును శిరసా వహిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో తనతోపాటు మొత్తం 164 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు ఓటమి పాలయ్యారని, కారణాలు ఏవైనా ప్రజా తీర్పును గౌరవిస్తున్నానన్నారు. వరుసగా పదేళ్లపాటు తాను ఎమ్మెల్యేగా పనిచేశానన్నారు. నియోజకవర్గాన్ని ప్రశాంతంగా ఉంచడంతోపాటు అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. ఉద్యోగులపై తనకు ప్రత్యేక గౌరవం ఉందని, వారిపై ఏనాడు పెత్తనం చేయలేదన్నారు. వ్యాపారులకు రక్షణ వలయంగా నిలిచానని అన్నారు. ఏనాడు వారిపై డబ్బు కోసం ఒత్తిడి చేయలేదని, రాజకీయ ఒత్తిళ్లు లేవని, ఎలాంటి ఇబ్బందులు పెట్టలేదన్నారు. 28 ఏళ్లుగా ప్రజల కష్ట సుఖాల్లో తాను పాలుపంచుకుంటున్నానని తెలిపారు. ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానని అన్నారు. ఎన్నికల్లో తనకు 83వేల మంది ఓటు వేశారన్నారు. ఒక మారు ఓడిపోయినంత మాత్రన ప్రజలను నిందించే మూర్ఖుడిని కాదన్నారు. గతంలో తాను వరదరాజులరెడ్డిపై గెలుపొందానని, ప్రస్తుతం తనపై వరద విజయం సాధించారన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన వరదకు శుభాకాంక్షలు చెబుతున్నానన్నారు.

అందరూ సంక్షేమ పథకాలు పొందాలి

టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన మేనిఫెస్టోకు ఆకర్షితులై ప్రజలందరూ ఆ పార్టీకి ఓట్లు వేశారని రాచమల్లు తెలిపారు. అర్హులైన వారందరికీ పథకాలు అందాలన్నారు. ఏడాది వరకు తాను ప్రభుత్వాన్ని విమర్శించనన్నారు. తర్వాత ప్రజా సమస్యలపై, ప్రభుత్వ తీరుపై స్పందిస్తానన్నారు. వరద చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందిస్తానన్నారు.

కార్యకర్తల వెన్నంటే ఉంటా

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి నిన్నటి ఎన్నికల వరకు తన వెంట నడిచిన నాయకులు, కార్యకర్తలను సంరక్షిస్తానని రాచమల్లు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, అటవీఅభివృద్ధిసంస్థ మాజీ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



బద్వేలులో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న వైవీయూ పాలక మండలి సభ్యులు సుబ్బారావు



అట్లూరు గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ, గ్రంథాలయాధికారి

బద్వేలు అర్బన్ : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని యోగివేమన యూనివర్శిటీ పాలక మండలి సభ్యులు కొండపల్లి చిన్నసుబ్బారావు తెలిపారు. శుక్రవారం బద్వేలు గ్రంథాలయంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు సందర్భంగా గ్రంథాలయాధికారి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు వేసవి కాలంలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు కూడా తరచూ గ్రంథాలయానికి వెళ్లి పుస్తకపఠనం చేయాలని కోరారు. తొలుత గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత షేక్ మహబూబ్‌సాహెబ్, ఆవాజ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎ.సత్తార్, అన్వర్‌బాషా, ఉపాధ్యక్షుడు ఖాజాగౌస్, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్లూరులో..

అట్లూరు : గ్రంథాలయాలు విద్యార్థులకు పట్టుకొమ్మలు లాంటివని ఎంపీడీఓ ఎస్.అమానుల్లా, మండల విద్యాశాఖాధికారి ఎస్.ఖాదర్‌వల్లిలు పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ అధికారి ఎస్.సుధాకర్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ, ఎంఈఓలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖనం, ఆటలపోటీల్లో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఎంపీడీఓ, ఎంఈఓల చేతులమీదుగా అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమయం ఉన్నప్పుడల్లా గ్రంథాలయాల్లో పుస్తక పఠనం అలవరుచుకోవాలని, తద్వారా ఎంతో మేధాశక్తి పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ భాస్కర్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు, పీఆర్‌పీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• రాజుపాళెంలో వర్షం



ప్రొద్దుటూరు-ఆళ్లగడ్డ ప్రధాన రహదారిలో నిలిచిన వర్షం నీరు



రాజుపాళెం పొలాల్లో నిలిచిన వర్షం నీరు

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు పదునయ్యాయి. అయితే శుక్రవారం మధ్యాహ్నం మోస్తరు వర్షం పడటంతో పొలాల్లో అక్కడక్కడా నీరు నిలిచింది. ఇప్పటికే సేద్యాలు చేశామని, పొలాల్లో తేమశాతం ఆరిన వెంటనే చెత్తాచెదారాన్ని ఏరేసుకొని విత్తనం వేసేందుకు సిద్ధం అవుతామని రైతన్నలు చెబుతున్నారు. ఒక్కసారిగా వర్షం పడటంతో రోడ్లపై అక్కడక్కడా నీరు నిలిచింది. – రాజుపాళెం

భక్తి శ్రద్ధలతో భద్రకాళికి రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి



రాహుకాల పూజల్లో పాల్గొన్న మహిళలు

రాయచోటి టౌన్ : పట్టణంలో వెలసిన భద్రకాళి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో నిర్వహించిన రాహుకాల పూజల్లో మహిళలు పాల్గొన్నారు. శుక్రవారం అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించిన తరువాత పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయలతో హారాలతో అలంకరించారు. అనంతరం మహిళలు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. అనంతరం భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం రాహుకాల పూజ విశిష్టతను వివరించి తీర్థప్రసాదాలు పంచారు. ఈ కార్యక్రమం ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. వీరభద్రుడి దర్శనార్థం పెద్దసంఖ్యలో కన్నడ భక్తులు ఆలయానికి వచ్చారు.

ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులో వెల్లడించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులకు సంబంధించిన వివరాలను నోటీసు బోర్డులో ఏర్పాటు చేయాలని పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం కడపలోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను వసూలు చేస్తున్నారని వాటని అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహించి అధిక ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. అలాగే ప్రతి పాఠశాలలో బుక్ స్టోర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు పుస్తకాలను విక్రయిస్తూ డబ్బులను దండుకుంటున్నారన్నారు. జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలల వివరాలను తక్షణం వెల్లడించాలని డిమాండ్ చేశారు. అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌యూ నాయకులు గోపి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ వ్యాప్తంగా గుర్తింపులేని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీష్, రాయలసీమ అధ్యక్షుడు నాగరాజ్‌లు కోరారు. ఈ విషయమై శుక్రవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 25 శాతం సీట్లను ఇవ్వాలని జీఓ ఉన్నా కొన్ని విద్యాసంస్థలు పట్టించుకోవడం లేదన్నారు.

జిల్లా విద్యార్థులకు ఇంటాక్ 'రీజినల్' బహుమతులు



విజేతల వివరాలను ప్రకటిస్తున్న చిన్నపరెడ్డి

కడప కల్చరల్ : జిల్లా విద్యార్థులకు ఇంటాక్ రీజినల్ స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖన పోటీలో బహుమతులు లభించాయని సంస్థ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. ఇటీవల ఢిల్లీలోని ఇంటాక్ కేంద్ర కార్యాలయం 'మై మాన్యుమెంట్ సెల్ఫీ' పేరిట విద్యార్థులకు ఈ పోటీ నిర్వహించిందన్నారు. దేశ వ్యాప్తంగా వంద నగరాల్లో ఈ పోటీకి 12 వేల మంది హాజరయ్యారన్నారు. కడపలో జరిగిన పోటీలో 110 మంది పాల్గొన్నారని, ఇందులో నగరానికి చెందిన విద్యామందిర్ ఇంగ్లీషు మీడియం హైస్కూలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఆర్.మహాలక్ష్మి, 9వ తరగతి విద్యార్థి బి.దీక్షిత, స్థానిక బాల వికాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూలుకు చెందిన 7వ తరగతి విద్యార్థి ఎన్.జియోన్ ప్రణుతి రీజినల్ స్థాయి బహుమతి సాధించినట్లు తెలిపారు. వారం రోజుల్లో ఆయా పాఠశాలల్లో విజేతలకు ఈ బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఆయ న తెలిపారు.

ఐక్యవేదిక అధ్యక్షుడిగా జయరాం

కడప సెవెన్‌రోడ్స్ : జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ కడప నగర అధ్యక్షులుగా మాసాపేటకు చెందిన గున్నా జయరాంను నియమించినట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. నేటినుంచి తమ పార్టీకి సంబంధించి వార్డు, గ్రామ, మండల కమిటీలు ఏర్పాటు చేయాలని, ప్రజా సమస్యలపై స్పందించి వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. ఆ నివేదికలను రాష్ట్ర, కేంద్ర కమిటీలకు పంపాలని నిర్దేశిస్తూ నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి



విద్యార్థులతో ఎంఈఓ సావిత్రమ్మ, గ్రంథాలయ అధికారులు

ప్రొద్దుటూరు : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎంఈఓ సావిత్రమ్మ తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలోని పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో శుక్రవారం వేసవి శిక్షణ ముగింపు సభ నిర్వహించారు. ప్రథమ శ్రేణి గ్రంథాలయం, రామేశ్వరం బాలబాలికల ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. అందులో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ సావిత్రమ్మ సర్టిఫికెట్లు, బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి ఏడాది గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారన్నారు. వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు కథలు రాయడం, చెప్పడం, వినడం, జనరల్ నాలెడ్జ్, పద్యాలు, స్పోకెన్ ఇంగ్లీషు, చెస్, క్యారెమ్స్ తదితర అంశాల్లో శిక్షణ పొందారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి తిరుపతమ్మ, రాయలసీమ వ్యాయామ విద్య కళాశాల గ్రంథాలయ అధికారి గంగాధర్‌రెడ్డి, రామేశ్వరం బాలబాలికల గ్రంథాయం రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్, చాడా మునిశేఖర్‌రెడ్డి, పవన్‌కళ్యాణ్, ఆర్టీపీపీ డీఈఈ ఆర్.ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు నిర్మలజ్యోతి, రిటైర్డ్ వైమానిక దళ ఏఈ వెంకటకొండయ్య, గ్రంథాలయ హెల్పర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష విడనాడాలి



మైదుకూరులో లింగ వివక్షపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

మైదుకూరు : సమాజంలో ప్రతి ఒక్కరూ లింగ వివక్షను విడనాడాలని ఐసీడీఎస్ మైదకూరు ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి అన్నారు. మైదుకూరు పట్టణం, మండలంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో లింగ వివక్ష నిర్మూలన, లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మైదుకూరు పట్టణంలోని అంగన్‌వాడీ–6 కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ ఆడ పిల్లలు లేని సమాజాన్ని ఊహించుకోవడం కష్టమన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడి ఆడ పిల్లలను తల్లి గర్భంలోనే చిదిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పుట్టబోయే బిడ్డ ఆడో మగో చెప్పే స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులపై తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. లింగ వివక్షను పాటించకుండా ఆడ పిల్లలను పుట్టనివ్వాలని, వారిని చదవనివ్వాలని, ఎదగనివ్వాలని పిలుపునిచ్చారు. మండలంలోని వనిపెంట సెక్టార్ పరిధిలో విశ్వనాథపురం ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం, జీవీ సత్రం సెక్టార్ పరిధిలోని తువ్వపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జేపీ ప్రశాంతి, వరలక్ష్మిదేవి, ఓబుళమ్మ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

పోరుమామిళ్ల : చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మాజీ రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారు నాగార్జునరెడ్డి కోరారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు ఊహించని విధంగా వచ్చాయని, వైఎస్సార్‌సీపీ 5 సంవత్సరాల పాలనలో ప్రజలకు ఎంతో సేవ చేసిందని, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిందని అయినా ఓటమి పాలు కావడం నివ్వెరపాటుకు గురిచేసిందన్నారు. దీంతో నా పదవికి రాజీనామా ఇచ్చానని ఆయన అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాల వల్ల రాష్ట్రం అప్పుల పాలైందని, త్వరలో శ్రీలంక అవుతుందన్న చంద్రబాబు అంతకు రెట్టింపు పథకాలు అమలు చేస్తానని ఎన్నికల్లో మాట ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందన్నారు. జులై 1న అవ్వాతాతలకు రూ.7 వేలు, ప్రతి నెల రూ.4 వేలు ఇవ్వాలని, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఇంట్లో బిడ్డలందరికీ అమ్మ ఒడి, 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం, ప్రతి ఇంటికి ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇలా 25 హామీలు ఇచ్చారని వాటిని అమలు చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. విద్యుత్ చార్జీలు పెంచమని, అదనపు పన్నులు వేయమని, మద్యం ధరలు తగ్గించి, నాణ్యమైన మద్యం అందిస్తామన్నారని, రైతు భరోసా రూ.20 వేలు ఇస్తామని చెప్పారని, చెప్పిన హామీలు నెరవేర్చితే మా పార్టీ కూడా మద్దతు ఇస్తుందన్నారు.

ఆహార పదార్థాల తయారీపై శిక్షణ



శిక్షణ పొందుతున్న మహిళలు

ప్రొద్దుటూరు : స్థానిక పశువైద్య కళాశాల పశు ఉత్పత్తుల సాంకేతిక విభాగంలో శుక్రవారం ఐసీఏఆర్ ఎస్సీ సబ్‌ప్లాన్ సహకారంతో గ్రామీణ ఎస్సీ మహిళలకు ఆహార పదార్థాల తయారీపై శిక్షణ ఇచ్చారు. పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ మహిళలు ఆహార పదార్థాల తాయరీలో శిక్షణ పొంది స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు ఉత్పత్తుల సాంకేతిక విభాగాధిపతి డాక్టర్ ఇ.నాగమల్లిక, అధ్యాపకులు డాక్టర్ ఆర్.సాయిదిలీప్ గుప్తా, డాక్టర్ రాజతిమ్మారెడ్డి, డాక్టర్ బీవీ వివేకానందరెడ్డి, సహాయక సిబ్బంది పుల్లారెడ్డి, రమణ పాల్గొన్నారు.

'పుట్టా' గెలుపుతో మొక్కు తీర్చుకున్న అభిమాని



అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి సన్నిధిలో టెంకాయలు కొడుతున్న పుట్టా అభిమానులు, కార్యకర్తలు

చాపాడు : సార్వత్రిక ఎన్నికల్లో మైదుకూరు ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్ యాదవ్ గెలుపొందటం పట్ల ఆయన అభిమాని మండలంలోని నెర్రవాడకు చెందిన చల్లా శివరాం అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థానం సన్నిధిలో శుక్రవారం మొక్కు తీర్చుకున్నారు. వీరభద్రస్వామికి 101 టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుదర్శన్, లక్ష్మీనారాయణ, సుధాకర్, ప్రసాద్, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు. ఇదే క్రమంలో మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామంలో మాజీ సర్పంచ్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. గ్రామంలోని ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

పోరుమామిళ్ల : ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, పార్టీ అధికారంలో లేనంత మాత్రాన అధైర్య పడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు, కిందిస్థాయి నాయకులకు మేము అనుక్షణం అండగా ఉంటామని, ఎవ్వరూ ఆందోళన చెందవద్దన్నారు. బద్వేలు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి ఎమ్మెల్యేగా డాక్టర్ సుధ, ఎంపీగా అవినాష్‌రెడ్డిని గెలిపించిన వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. పార్టీ ఊహించని విధంగా ఓటమి పాలయిందని, ఇలాంటి తరుణంలో ప్రతి ఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడవాలన్నారు. బద్వేలు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలిగినా ఎమ్మెల్సీగా నేను, ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ పూర్తి స్థాయిలో అండగా ఉంటామన్నారు.

ప్రజలు శాంతియుతంగా జీవించేందుకు కృషి చేయాలి



నాయకులతో మాట్లాడుతున్న సీఐ భాస్కర్‌రెడ్డి

కడప అర్బన్: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరువాత ప్రజలు శాంతియుతంగా జీవించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలనీ కడప ఒన్ టౌన్ సీఐ సి. భాస్కర్‌రెడ్డి తెలియజేశారు. శుక్రవారం సాయంత్రం కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శాంతి సంఘం నాయకులతో సీఐ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కడప నగరంలో ప్రజలు ఎలాంటి మతపరమైన విద్వేషాలకు గురికాకుండా, అల్లర్లకు తావీయకుండా శాంతియుత వాతావరణంలో జీవించేందుకు వివిధ మతాల పెద్దలు తమ వంతుగా ప్రజలకు ఉద్బోధ చేయాలనీ సీఐ సూచించారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడటానికి ప్రయత్నించినా, ప్రజల శాంతి యుత జీవనానికి భంగం వాటిల్లేలా కుట్రలు పన్నినా అలాంటి వారి సమాచారం తమ దృష్టికి తీసుకురావాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామనీ సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు రంగస్వామి, మధుసూదన్‌రెడ్డి, శాంతి సంఘం నాయకులు అమీర్‌బాబు, నజీర్ అహ్మద్, సలావుద్దీన్, షామీర్, భాస్కర్‌రెడ్డి, అబ్రహాం, విజయ్ భట్టర్ పాల్గొన్నారు.